# దొడ్డమ్మ వారసులు

తంతివార్త అందేసరికి నేను వెయ్యిమైళ్ళ దూరంలోవున్నాను.

*  *  *

అస్సామ్‌లో బ్రిడ్జింగ్ ట్రైనింగు క్యాంపుకు అది చివరిరోజు. హవిల్దార్ల మెస్సులో మధ్యాహ్నపు భోజనం అయిందనిపించి, రాత్రి బండిలో తిరుగు ప్రయాణానికి అవసరమైన రైలు వారంటు కోసం, ఆఫీసు శిబిరంవేపు అడుగువేస్తూండగా, కంపెనీ సుబేదారు పిలుపు వచ్చింది.

హేమంత ఋతువు. నడుస్తున్నది నవంబరు నెల. హిమాలయ పాదాగ్రశ్రేణుల నుండి చలిగాలివీస్తున్నది.

నా సాల్యూట్ అందుకోకుండానే, సుబేదార్‌పాండే "చలో" అన్నాడు తను కుర్చీలోంచి లేస్తూ. మునివాటికలను గుర్తుకు తెచ్చే

వెదురు పొదల గుండా అతన్ని అనుసరిస్తున్నాను. వలయాకారంగా తొమ్మిదో పదో పనసచెట్లు - వాటి మధ్యనే ఎడ్జుటెంటు కెప్టెన్‌గారి డేరా. మొదటిసారిగా అనుమానం వేసింది. నన్నొక్కడినే ఎందుకు పిలిపిస్తున్నారు? నాతోపాటు యింకెవ్వరూ వస్తున్నట్లు లేదే?

ఎడ్జుటెంట్ పేరు కెప్టెన్‌రామ్‌సింగ్.

నన్ను తీక్షణంగా చూస్తూ నఖశిఖ పర్యంతం పరికిస్తున్నాడు. ఒక్క పలుకు లేదు. నాకేమో అగమ్యంగావుంది. రెండు క్షణాల నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ, అతని పెదవులనుండిగాక కళ్ళ నుండి పిడుగులు వర్షిస్తున్నట్లుగా ప్రశ్న వినిపించింది.

"ఈ దొంగ టెలిగ్రాం ఇచ్చిందెవరు?"

రాకెట్ వేగంతో, నామీద వచ్చిపడింది సరిగ్గా గురిచూసి కొట్టిన-ఆర్మీసిగ్నల్ కాగితం. అంతవరకూ దాని సంగతే నాకు తెలీదు.

"దొడ్డమ్మ చనిపోయింది. నీకోసం శవం వుంచుతున్నాం. బి. రామ్‌సింగ్."

డేరా నిండుకొని అన్ని దిశలనుండి నిశ్శబ్దం.

"హూఁ! క్యోఁకామోష్‌రహితే-?"—అని మళ్ళీ హిందీలో ఫిరంగి గుండు.

"బొందిలీ రామ్‌సింగు...నా స్నేహితుడు—మాదొడ్డమ్మ నన్ను పెంచింది—"

నాచెతులు వణకటం ఒక్కటే నాకు తెలుసు. నేలమీదకు, ఆ కాయింతంతో పాటు ఎట్లా ఒరిగి పోయానో, సుబేదార్‌సాబ్ తన బాహు బలంతో మధ్యలో నన్నెట్లా ఆపాడో, మంచినీటి గ్లాసును కెప్టెన్‌గారు నా పెదిమలమీద బలవంతంగా ఆనించి, ముఖంమీద చిలకరించటం లీలగా మాత్రమే గుర్తు. గడచిన సమయం మాత్రం గుర్తులేదు.

టెలిఫోన్లు మోగుతున్నవా? హిందీలో మాటలు....ఇంగ్లీషులో వాక్యాలు...

మెడికల్ ఆఫీసర్ మేజర్ రత్నాకర్ - నావీపు రాస్తూ, భుజం తడుతూ అంటున్న తెలుగు పదాలు...

"మా ప్రాంతంలో బొాందిలీలని రాజపుట్స్... మొగలాయీ రోజుల్లో కాందిశీకులు...ఇంజెక్షన్ అవసరంలేదు. చిన్న మెంటల్ షాక్...అంతే" మళ్ళీ టెలిఫోను.

సంతకం అంటున్నాడు సుబేదార్ పాండే. జేబులో నోట్లుకుక్కు తున్నాడు. "అడ్వాన్సు...వుంచుకో"

బయట జీపు ఛర్రున ఆగిన శబ్దం.

"కూర్చో...భానూ...ఎక్కు"

దుఃఖం ఆగిపోయింది. బాల్యంలోనే జననీజనకుల్ని కోల్పోయిన అభాగ్యులకు విచారంనుండి తేరుకోవటం చాలా తేలికనుకొంటాను.

* * *

ప్రయాణం.

జోంగా జీపు వేగంతోపాటు, ఈశాన్య భారతంలో సంధ్యా ఘడియల్లోనే అలముకొనే హేమంతయామిని పరుగిడివస్తున్నట్లుంది. అప్పటిదాకా అస్సాం హరిత వనంలోని మనోహరమైన పోకచెట్లు, వెదురు పొదలగుబుర్లు, కర్రవంతెనలూ, మెట్లమెట్ల తేయాకుతోటలు - రివ్వు రివ్వున వెనక్కి పయనిస్తూ ఆహ్లాదంకొలిపినవి. ఇప్పుడు అలముకొంటున్న చీకట్లో అభూతభూతాలుగా కళ్ళగడుతున్నవి. కొద్దిసేపట్లో అస్సాం మెయిల్ బండి గౌహతి స్టేషన్నుండి బయలుతేరుతుంది. గౌహతి - ఉత్తరబీహార్‌లో బరౌనీ - పశ్చిమబెంగాల్‌లో హవురా - ఓఢ్రదేశపు భువనేశ్వర్ - విజయవాడ. బరౌనీలోనూ, తిరిగి హవురా లోను, బండ్లు మారాలి. నాలుగురోజులు - యీ ప్రయాణం. దొడ్డమ్మను ఎట్లా వుంచుతారు?

రైలు వారంటు యిచ్చారా ? జేబు తడుముకొంటున్నానుగాని, జీపు గౌహతి నగరాన్ని గూడా దాటి, యూనివర్సిటీ బిల్డింగుల్ని వెనక

పడేస్తున్నది. ఆలోచనల మసకనుండి దేరిపార జూసేసరికి -బోర్డార్ విమానాశ్రయలలో గ్రవుండ్ లైట్లు జిగేలున వెలిగిపోతున్నవి. నా సామాన్లు దించుతూ "రాంరాంబాబూజీ" అంటున్నాడు నేపాలీ మెస్ బాయ్.

భారత వైమానికదళ విమానాలు. కొరియర్ సర్వీసులోగాని, ట్రైనింగ్ సర్వీసులోగాని దూరదూర ప్రాంతాలకు పయనిస్తున్నపుడు సైనిక దళాల సభ్యులకు వీలునుబట్టి ప్రయాణాలకు అనుమతిస్తూంటారు. నేనిప్పుడు అటువంటి విమానంలో ప్రయాణీకుణ్ణి.

ఆ విమానం పైలట్ పేరు వింగ్ కమాండర్ రామ్‌చంద్.

అంతా రామమయం. ఇందాక నాకు వీడ్కోలు చెప్పిన నేపాలీ మెస్‌బాయ్ పేరుగూడా రామబహదూర్ కదా.

దొడ్డమ్మ చివరి చూపుకు నేను నోచుకున్నానా? విమానం ఆకాశంలోకి లేస్తున్నపుడు, యింకే శబ్దమూ వినబడలేదు. బ్రహ్మ ముహూర్తాల్లో, సూర్యభగవానుడెప్పుడు లోకాన్ని జాగరితం చేస్తాడోనని మానవాళి వేచి వుండే ప్రభాత ఘడియల్లో-దొడ్డమ్మ సాధు మధురంగా ఆలాపించే అధ్యాత్మ రామాయణ గానం ఒక్కటే విమానం నిండా విస్తరిస్తున్నది.

* * *

నా పూర్వాశ్రమంలో-అనాధగా పెరుగుతున్నపుడు - దొడ్డమ్మ కథలే జ్ఞాపకం వస్తున్నాయి. బాగా స్మృతి. బాల్యంలో ఒకనాడు నాకు అభ్యంగన స్నానం చేయించి, తిరుచూర్ణం బొట్టు పెడుతూ దొడ్డమ్మ బోధించిన రాముడి మాటలు:

"నువ్వెప్పుడూ రాముణ్ణి పూజిస్తుండాలి నాన్నా"

"ఏ రాముడు....?"

"కోదండం ధరించిన శ్రీరామచంద్రుడు"

"ఎందుకు దొడ్డమ్మా?"

"తలిదండ్రుల అభయహస్తం కరువైన పిల్లలకు శ్రీరాముడే రక్ష"

"మరి నువ్వు లేవా....?"

"నేనెప్పుడూ వుంటానా పిచ్చీ?"

ఆ సత్యాన్ని నిరూపించటానికేనా యిప్పుడు నిజంగా పోయింది? పోతూ, నా భద్రతను రాముడికే అప్పగించిందా? కాకుంటే-బొందిలీ రామ్‌సింగు-మా పాత యూనిట్‌కు టెలిగ్రాం యివ్వటమేమిటి, రెండు గంటల్లో అది ఆర్మీ సిగ్నల్‌గా మారి వెయ్యి మైళ్ళ దూరం చేరుకోవటమేమిటి, ట్రైనింగులో వున్నవాడు దొంగ టెలిగ్రాం తెప్పించుకొని, సెలవు కోసం ఎత్తులు వేస్తున్నాడన్న అనుమానం క్షణాల్లో క్షయం కావటమేమిటి, తంతివార్తలో వుత్తరాది రామ్‌సింగు పేరుకూ, దక్షిణాది భానూరావుకు సంబంధం ఏమిటనుకొన్న- కెప్టెన్ రామ్‌సింగు— నిమిషాల్లో యీ విమాన ప్రయాణాన్ని సులభసాధ్యం చేయటమేమిటి?

* * *

కలకత్తా మహానగరపు విద్యుత్ మహార్ణవకాంతి, ఒక పార్శ్వంలో కనుమరుగై పోతుంటే, కలైకుండలో విమానం దిగింది. అది టాంకర్లు నింపుకొంటూంటే తక్కినవాళ్ళ భోజనం. టీ గూడా లోపలికి పోక తల పట్టుక కూచొన్నాను. వింగ్ కమాండర్ రామ్‌చంద్ వెనగ్గా వచ్చి భుజం తట్టాడు.

"హైదరాబాదుకు మీవూరు ఎంత దూరం?"

"మళ్ళీ వెనక్కి పోవాలి. విజయవాడకైతే చాలా సమీపం"

"ఠీక్ హై. టాక్సీమే జాసక్తే హైనా?"

నన్ను గురించి మా ఎడ్జుటెంటు కెప్టెన్ ఆయనకు చెప్పివుండాలి. కలైకుండ టాక్సీ ట్రాక్‌మీద విమానం నడుస్తున్నది. నావిగేటర్ ఆఫీసరు రేడియో మెస్సేజి ఇస్తున్నాడు.

* * *

హైదరాబాదు-హకీంపేటలో ఎన్ని గంటలకు విమానం దిగిందో తెలియదు. గడియారం ఆగిపోయి వున్నది. హృదయమూ అలసిపోయింది. దొడ్డమ్మ చరణ పద్మాలు మాత్రమే ఎదనూ, మదినీ చల్లగా తాకుతున్నవి.

"ఆరొందలకు ఎవరూ తగ్గలేదు" అంటూ వారెంటాఫీసరెవరో టాక్సీ తలుపు తెరిచి కూచొనబెట్టటం ఒక్కటే నాకప్పుడు వినవచ్చిన ఐహికలోక శబ్దం. జేబు చూచుకొన్నాను. సుబేదారు పాండే జేబులో కుక్కిపోయిన నోట్లు లెక్కించుకొన్నాను. ఆరొందలు.

తెలతెలవారుతుండగా బావురుమంటున్న దొడ్డమ్మ యింటిముంగిట టాక్సీ పాత యింజను మోతతో మెలకువ వచ్చింది. ఎక్కడా ఏడుపు, జనసందోహపు జాగరణ వినిపించటం లేదు. కనిపించటం లేదు. తిరిగిపోతూన్న మోటారు కారు శబ్దానికి చెట్లమీది పక్షులు ఒకే లయతో తిరిగి శబ్ద ప్రపంచానికి మేల్కొలుపు పాట పాడినట్లయింది.

వేసవికి-ఇంటిముంగిటి ఆవరణలో దొడ్డమ్మ వేయించిన తాటాకుల పందిరి, మూలగా బల్లమీద ఎవరో చలికి ముడుచుకుని పడుకొన్నట్లు మసక చీకట్లో ఆనవాలు, వరండా గడప మీద వత్తి తగ్గించి వున్న హరికేన్ దీపం, ఆ వరండా వుత్తరదిక్కులోనే, మినుకు మినుకుమంటున్న ప్రమిదెలో చిన్న వెలుగు, గడ్డి పానుపు మీద సుదీర్ఘనిద్రలో వంటరిగా దొడ్డమ్మ. శాంతీ, తేజస్సూ, పరమసుఖం-వెదజల్లుతున్నట్లున్న ఆమె ముఖవర్చస్సూ.

"దొ....డ్డ....మ్మా...."

ఆమె వులకలేదు. పలకలేదు. కాని నా రోదన విని కాబోలు పందిట్లో కునుకు తీస్తున్న బొందిలీ రామ్‌సింగు ఒక్క వుదుట్లో లేచి వచ్చి నన్ను కౌగలించుకున్నాడు.

*　　　*　　　*

రామ్‌సింగు తండ్రి, ఆ వూరెప్పుడు వచ్చి స్థిరపడ్డాడో నాకు

తెలియదు. అతని పేరేమోగూడా- అందరూ "సింగూ" అనే వ్యవహ రించేవారు. పేదాబిక్కీకి గోసాయి చిట్కా వైద్యం చేస్తూండేవాడు. పెదనాన్నగారి- వంటికణతనొప్పిని ఒక్క చెట్టువేరుతో చికిత్సచేసి సంవత్సరాల బాధను నివారించాడు. అట్లాగే, మోకాళ్ళ వాతనొప్పులకు అంజనాలు స్వయంగా తయారుచేసి యిచ్చి బాధానివారణ కల్పించాడు. పని లేనప్పుడు గంజాయి దమ్ము పీలుస్తూ గోసాయివాళ్ళతో నిశ్శబ్ద దేవతలాగా కూచొనేవాడు. అతను నిరాడంబరుడైన తత్వజ్ఞాని అని పెదనాన్నగారికీ గురి వుండేది. వైద్యంమీద కొద్దోగొప్పో ఆర్జనవున్నా అది సాధుసన్యాసుల సత్కారాలకు చాలేదికాదు. పెదనాన్నగారికి పాము కాటు మంత్రం, తేలు మంత్రం ఉపదేశించాడని-దొడ్డమ్మ అంటుండేది. తేలుకాటు మంత్రం నేర్చుకోవాలని నాకైతే చాలా వుబలాటంగా వుండేది. పెదనాన్నగారు గొడ్లసావిడికి అభిముఖంగా అతనికో చిన్న కుటీరం కట్టించి యిచ్చారు. అదే కైవల్య కుటీరం. రామ్‌సింగును కలుపుకొని కుటీరందాకా తేలుమంత్రం కోసం ఎన్నిసార్లు వెళ్ళానోగాని ధైర్యం చాలక నోరు తెరిచేవాణ్ణి గాదు. "నువ్వెప్పుడూ యింతేరా" అని రాముడు నా పిరికితనాన్ని దుయ్యబట్టినా, నాకావిద్య అబ్బలేదు.

రాముడు తల్లిలేని వాడని, దొడ్డమ్మ తన సత్కృపారసంతో వాణ్నిగూడా ముంచెత్తేది. పండుగలకు నాతోపాటు మంగలిచేత తలంట్లు పోయించేది. నాతోనే చదువు, గుడ్డలూ. ఏమైతేనేం, నా దరదృష్ట జాతకం- సహవాసదోషం వల్లనేమో, వాడిమీదా ప్రతిఫలించి అనాధ అయిపోయాడు.

పెదనాన్నగారు పోయిన సంవత్సరం లోపునే, పెదసింగు నిర్జీవ కళేబరం- కైవల్య కుటీరం వెనక, ఒక తెలవారుఝామున గ్రామస్థుల కళ్ళబడింది. తాళపత్రాల కాలజ్ఞానం గ్రంథంకోసం, గోసాయివాళ్ళెవరి తోనో వచ్చిన పెనుగులాటలో చచ్చిపోయాడని వూళ్లో కొందరు చెప్పు కొన్నారు. అది వట్టి అభూతకల్పన- గ్రామంలో ఒక పాలేరు చావు

కేసులో, కోర్టులో సాక్ష్యం చెప్పి చావు తెచ్చుకొన్నాడిని కుంకపుదాసర్లు, చాకళ్ళు, మంగళ్ళు- వాళ్ళల్లో వాళ్లు చెవులు కొరుక్కొన్నారు.

పెదసింగు చావు తర్వాత వారం రోజులకు కాబోలు రాముడితో చెప్పాను.

"రాముడూ పెదనాన్నగారి సాలిగ్రాముల జింకతోలుపెట్టెలో బ్రహ్మంగారి కాలజ్ఞానం తాళపత్రాలు వున్నాయిగదా, మరి గోసాయి వాళ్ళతో తగాదా ఎందుకొచ్చిందిరా!"

రాముడు కొన్ని క్షణాలు ఏమీ బదులు చెప్పలేదు. కళ్ళప్పగించి చూస్తూ, ఒక్కసారి నన్ను కౌగలించుకొన్నాడు. వాడి కళ్ళు నీళ్ళతో పూడిపోవటం నేనప్పుడే చూశాను. వాడి చర్య నాకేమీ అర్థం కాలేదు, కాని ఆనాటినుంచే బడి మానేశాడు. దొడ్డమ్మ కోప్పడినా మాట వినలేదు. నేను బ్రతిమిలాడాను. "నీకు తేలీదు వూరుకోరా" అని మందలించాడు.

ఇప్పుడు, వాడు బందరు నకిలీ గోల్డు సొమ్ములు వూరూరూ తిరిగి అమ్ముతుంటాడు. గ్రామ పేదల సంఘం మీటింగుల్లో జెండాలు పట్టి పాటలు పాడుతుంటాడు. క్రిందటేడు సర్పంచ్ పదవికి పోటీ చేసి ఓడిపోయానని వ్రాశాడు. అప్పుడు నేను సెలవు మీద వచ్చినప్పుడు దొడ్డమ్మ అన్నది; "ఈ ఎన్నికల్లో కుక్కలు గెలవ్వురా"

'అదేమిటి దొడ్డమ్మా? వాణ్ణి కుక్క అంటావు?" అని నేను విస్తుపోతూ ప్రశ్నించాను.

"అవున్రా కుక్కలు విశ్వాసపాత్రమైనవి, విశ్వాసం ఎవరిక్కావాలి బాబూ- ఈ రోజుల్లో"

దొడ్డమ్మ వాణ్ణి అప్పుడప్పుడు కోపంతో "చీమవెధవా" అని తిట్టేది. అది తిట్టు కాదని తర్వాతనే వాడి నవ్వు నుండి గ్రహించాను. చీమలకు విశ్రాంతి ఉండదు గదా. నిరంతరశ్రమజీవులు చీమలు. రాముడు రికామీగా ఎన్నడూ వుండలేదు.

ఆ రామసింగే ఇప్పుడు నా హృదయంలో నగారామోతలు విని

అనునయిస్తున్నాడు.

*　　　*　　　*

రాముడూ, దొడ్డమ్మ చివరి గడియల్లో నువ్వు దగ్గిరున్నావా?"

రాముడు తలవంచుకున్నాడు. నా కళ్ళల్లోకి చూడలేదు.

"నేను మొన్న సాయంత్రమే గదా వచ్చింది"

"వూళ్ళో లేవా?"

"లేను.... మామగారింట్లో వారం రోజులు అతిథిగా వున్నాగదా"

"మామా(?"

"అవున్నా. పోలీసు ఠాణాలో...."

తరువాత నాకు తెలిసినాయి- వివరాలు.

పెదసింగుది సహజమరణం కాదు. దారుణహత్య. ఈ కాండకు కారలుడైన మోతుబరి ఆసామి మొన్న మొన్నటి దాకా బాహాటంగా నిర్భయుడై తిరిగాడు. కాని యీమధ్యనే- అతని కాళ్ళు విరగ్గొట్టారు- ఎవరు ఒడగొట్టారో- పూర్తిగా కుంటివాణ్ణి చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని. రైతుకూలీ సంఘంలో కుర్రవాళ్ళని పట్టుకెళ్ళారు. సాక్ష్యం దొరకలేదు. వూళ్ళో ఎవరూ నోరు విప్పలేదు. వారం రోజుల తర్వాత, రాముణ్ణి, ఇతర అనుమానితుల్ని- కొద్దిపాటి మర్దన తర్వాత విడిచి వచ్చారు. రాముడి మీద నాకూ అనుమానమేగాని వాడి ముఖం చూస్తే- వాడు దోషి అని ఏ మానవుడూ అనలేడు.

*　　　*　　　*

రాముడూ - పెద్దక్కా- చిన్నక్కా- అయినా రాలేదా? పెద్ద బావ...చిన బావ కనపడరేం...?"

అదొక్కటి గాదు, నా మనసులో మూగుతున్న ఆలోచనావేదన పరంపర.

దొడ్డమ్మ కదిలితే చాలు. కారుణ్య ప్రకంపనాలు ప్రసరించేవి. మాటాడితే మానవీయ మధురిమలు పరచుకొనేవి. కేవలం ఆమె

దృక్కుల్తోనే దరిద్రనారాయణుల దైన్యందూరమైపోయేది. నిరంతర వ్రతాలమధ్య అన్నదానాలు. పక్ష ఏకాదశులు, మాస శివరాత్రులు, వచన రామాయణ నిత్యప్రవచనాలు, గీతాస్మృతి మహాత్యాలు, ఏవీ తనకు తోడు రాలేదా?

దొడ్డమ్మా నీవు గ్రామంలో ఆదుకొన్న అసంఖ్యాక అనాధలైనా తుదిగడియల్లో అశ్రు తర్పణ నివాళులర్పించేందుకు రాలేదా? నీవు పెంచి అభిమానించిన పొగడ చెట్లు, గున్నమామిడి వృక్షాలు మాత్రమే - ముంగిట మూగగా రోధిస్తూ, పొగమంచు బరువు కణాలను కన్నీరు కార్చటం - నీవు నిజంగా నిస్సంతువనా - దొడ్డా?

రాముడు నా హృదయవేదన గ్రహించి కాబోలు నన్నింకా గట్టిగా పట్టుకొని - "ఊరి జనమంతా నిన్నటినుంచి రాత్రి 10 గంటల వరకూ, యిక్కడే జాగారం చేసార్రా బాబూ. దొడ్డమ్మ అందరికీ దొడ్డమ్మేరా పిచ్చివాడా! నీ అక్కలూ, బావలూ వాళ్ళను తరిమికొట్టక పోతే అక్కడే నిద్రాహారాలు మానివుండే వాళ్ళురా - నాయనా -" అని వుద్వేగంగా చెప్పుకు పోతున్నాడు.

"మరి వాళ్ళేరీ-?" అని యిందాకటి ప్రశ్నే మళ్ళీ అడిగాడు.

"ఉన్నార్లే, మీ పెదబావ లోపలే వున్నాడు - పాపం దుఃఖం పట్టలేక బీరు సీసాలు ధైర్యానికి తెచ్చుకొన్నాడు. పోయిచూడు. మీ పెద్దక్క జట్కాబండి కట్టించుకొని, నేను పురోహితులకోసం పోయొచ్చే సరికే వెళ్ళిపోయింది. మీ చిన్నక్క, చిన్న బావ టాక్సీలో వచ్చి వెళ్ళారు"

ఇల్లంతా బావురుమంటున్నది. ఏ మూల పరికించినా చిందరవందరైన సామాన్లు, చెల్లాచెదురుగా పడి వున్న దొడ్డమ్మ రామకోటి పుస్తకాలు. పెదనాన్నగారి నర్సరావుపేట పడకకుర్చీలో మాగన్నుగా నిదిరిస్తున్న పెదబావగారు. కుర్చీకింద రెండు బీరుసీసాలు. భూతధాత్రిగా బదికిన దొడ్డమ్మ యిల్లిది.

కిందటేడు నేను సెలవలమీద వచ్చినప్పుడు దొడ్డమ్మ నోటినుండే వెలువడిన భవిష్యద్వాణిని, నేనెందుకు సీరియస్‌గా ఆలోచించలేదు? ఎంత మూర్ఖుణ్ణి?

వర్షం కురుస్తున్న రాత్రి అది. గ్రామ వీధులన్నీ నిశ్శబ్దంగా వున్నాయి. మరునాడే నా ప్రయాణం. నా కిష్టమని ఆలుగడ్డ కూర, ఇంగువ తిరగమూతబెట్టిన పెసర పచ్చిడి, కాకరకాయ ముక్కల్తో పచ్చిపులుసు చేసింది. నేను పెట్టిన బరంపురం పట్టుబట్టతో మడికట్టుకొని వడ్డిస్తున్నది.

"మజ్జిగ దొడ్డమ్మా" అని అడిగాను. గడ్డ పెరుగు వేయకుండా నేను సెలవుల్లో వున్నప్పుడు ఎప్పుడూ భోజనం పెట్టేది కాదు.

"బయట చల్లగా వున్నది. పాలు పోసుకో" అన్నది తను.

ఆ రోజు దొడ్డమ్మ వుపవాసం. రాత్రి పాలు మాత్రమే తాగి దీక్ష ముగిస్తుంది.

"వద్దులే దొడ్డా. నీవు తాగే పాలు, నాకు మజ్జిగ చాలు."

"పాలు పోసుకోరా. ఎచ్చేయేడు నిన్నడిగే వాళ్ళుంటారో వుండరో."

సిద్ధపురుషుల మార్మికభాష - దొడ్డమ్మ నుండి విన్నప్పుడల్లా నాకు భయం వేసేది. ఆమె కళ్ళల్లోకి కంచంనుండి తలెత్తి చూశాను. నిరంతరమూ ఆర్ద్రమై వుండే, ఆ కారుణ్య కవాటాలను ఇదివరకెన్నిసార్లో దర్శించాను. లోకంలో అందరిలాగా నిర్భీతితో బతికే హక్కు - నాకు లేదనుకొనే జిజ్ఞాసతో పెరిగిన ఈ అనాథకు అభయమిచ్చిన ఆమె నేత్రాలిప్పుడు, యిహలోక జీవివిగా నాకు తట్టలేదు. కంచంలోనే చేయి కడుక్కొని లేచిపోతుంటే మళ్ళీ అన్నది:

"అన్నిటికీ అంత భయపడితే ఎట్లారా? పండుటాకులు ఎండి రాలిపోవటం ప్రకృతి ధర్మం. నీ చుట్టూ పరికించు."

ఎప్పుడూ లేనిది, ఆసారి నాతోపాటు వంటెద్దుబండిలో స్టేషను

దాకా వచ్చి సాగనంపింది. ఆమెను వారణాశి తీసుకు వెళ్ళాలని ఎంతో ఉబలాటపడేవాణ్ణి. ఆ మాటే రైలు ప్లాట్‌ఫారంమీద అన్నాను.

మన పూర్వులంతా కాశీ వెళ్ళ గలిగారా? స్తోమతు వుండి గూడా మీ పెదనాన్నకు ఆ యాత్ర సమకూడిందా? క్రిష్ణమాత్రం గంగవంటిది కాదా? వాళ్ళ అస్థికలన్నీ క్రిష్ణమ్మ తనతో కలుపుకోలేదుట్రా?" అని రహస్య గర్భితంగా ఆమె సమాధానం వచ్చింది.

బోగీలో ఎక్కి కూచున్నాక, రామ్‌సింగు ముందే ఇంకోమాట చెప్పింది. "ఈ వూళ్ళో నీ హితులెవరో తెలుసుకో. నేను చెవుల్లో ఇల్లు కట్టి చెప్పలేను. నీకోసం వానలో తడుస్తూ భారతి వచ్చి వెళ్ళింది. చెప్పి వచ్చావా?"

భారతి విధవ పిల్ల. తల్లి గూడా గతించింది. ఆ పిల్లను నేను చేసుకొంటానంటే దొడ్డమ్మ బాధపడ్తుందేమోనని, ఎప్పుడూ నోరు విప్పలేదు. రాముడి వంక చూశాను. బహుశః వాడే రహస్యం చెప్పి వుంటాడు.

* * *

నేను గడపదాటబోతుంటే, పెదబావగారు కళ్ళు తెరిచి, చేత్తో ఖాళీ బీరు సీసాను తడుముకొంటూ "అప్పుడే ఎట్లా వచ్చావ్?" అని అడుగుతున్నాడు.

"విమానంలో"

"మేము టెలిగ్రాములు ఇవ్వలేదే!" అన్నాడు మళ్ళీ. నాకు సమాధానం యివ్వాలనిపించలేదు.

పొగమంచు విచ్ఛిన్నమైపోతున్నది. తొమ్మిది గంటలు దాటింది గాబోలు - వూళ్ళో జనం చాలామంది బయట చేరినట్లుగా వున్నది. బాదంచెట్టు ముదురుటాకునుంచి టప టపమని మంచినీళ్ళు, మూగుతున్న స్త్రీ జనం ఆర్ద్రనేత్రాలనుండి అశ్రుజలాలు. ఎవరెవరోవచ్చి నన్ను పలకరిస్తున్నారు. నేనింత వేగిరంగా రాగలగటం ఆ పల్లీయులికి చాలా

సహజ చర్యగానే కన్పించింది కాబోలు. బావగారికి అట్లా ఎందు కనిపించలేదో.

ఎదురుగా - గృహ పురోహితులు బ్రహ్మయ్య శాస్త్రిగారు. ఏ ఉపోద్ఘాతం, సానుభూతి వాక్యాలు లేకుండానే ఆయనన్నాడు.

''నాయనా - ఒకటి యిసుక తక్కెడ, ఒకటి పేడ తక్కెడ. ఆ మహాతల్లి పుణ్యాత్మురాలు వెళ్ళిపోయింది. భవబంధాలు తెంచు కొన్నది. చెయ్యవలసిన కర్మకాండ నువ్వే చేయాలి. పట్టీ వ్రాసి తీసు కొచ్చాను. ఈ పట్టీ ప్రకారం వస్తువులు తెప్పిస్తే పని నడుస్తుంది. ఇక ప్రేతం వుండటానికి వీల్లేని పరిస్థితి"

* * *

ఈ తక్కెడల ప్రయోగం - ఒకసారి దొడ్డమ్మనుంచే విన్నాను - పెదనాన్నగారు బ్రతికి వుండగానే - నాకు ఉపనయినం తలపెట్టారు. ఆ ముహూర్తంలోనే నా దత్తత స్వీకారం గూడా జరిపించమని బ్రహ్మయ్యశాస్త్రిగారు - దొడ్డమ్మకు వుపదేశించారు. పెద్దక్క, చిన్నక్క పెద్ద గొడవ లేవదీశారు.

"మాకేమీ లేకుండా యీ దరిద్రుడికి అంతా కట్టి పెడతారా?''

ఏడుపులు, పెడబొబ్బలు, నిరాహార వ్రతాలు, మొత్తుకోళ్లు, తిట్లు - గందరగోళం అంతా యింతాగాదు. ఆ చిన్న తనంలో నాకీ ఆస్తిపాస్తుల వుపయుక్తాలు తెలియవుగదా. నేనూ ఏడుపు లంకించు కున్నాను.

''నువ్వెందుకేడుస్తావురా వెర్రి నాగన్నా. వాళ్ళు నీ రక్తం పంచుకొని పుట్టిన వాళ్ళా? ఒకటి ఇసుక తక్కెడ, ఇంకోటి పేడతక్కెడ. వాళ్ళిద్దరి మధ్యా సఖ్యత వుందా - నీకు పెడుతున్నామని ఏడవటానికి?''

అని దొడ్డమ్మ ఓదార్చింది. అవును, వాళ్ళు నా సొంత తోబుట్టువులా? ఇంకో దొడ్డమ్మ కూతుళ్ళు. నన్ను పెంచినట్లే ఆడపిల్లల మీద మమతతో, దొడ్డమ్మ వాళ్ళ పెట్టుపోతలూ చూచింది.

"మీ పెదనాయన, దొడ్డమ్మ చస్తే తల కొరివిగూడా పెట్టర్రా మీ బావలు. వాళ్ళను గురించి ఎందుకు దుఃఖపడ్తావురా?'' అని అంత చిన్న వయసులోనూ రాముడు నాపక్కనేవుండి చెప్పాడు.

*　　　*　　　*

దొడ్డమ్మ ధారణ, ధ్యానం చేసేది. రామకోటి రాస్తూరాస్తూ సమాధిలోకి వెళ్ళిపోయేది. ఇప్పుడూ అలా జరిగిందా? అది మరణం కాదా?

బ్రహ్మయ్య శాస్త్రిగారు భుజంకుదిపి నన్ను తట్టి - "ఆ పట్టీ సంగతి ఏం చేశావయ్యా?'' అంటున్నారు.

నా జేబులో టాక్సీవాడికి యిచ్చిం తర్వాత - ఎర్రపైగాని లేదు. రాము డివంక చూశాను. "మీ పెదబావను అడగవోయ్'' అన్నాడు వాడు.

ఆయనవరండాలో స్థంభానికానుకొని యింటిహాల్లోంచి వస్తున్న ఘర్షణ వింటున్నాడు. ఇంతమంది పలకరింపులమధ్య పెద్దక్క, చిన్నక్క, బావా రావటం నేను గమనించలేదు.

"ఒంటరివాడివి-నీ దగ్గర డబ్బులేక పోతే పెద్ద సంసారం నడుపుతున్నవాణ్ణి నా వద్ద ఏముంటుంది చెప్పు? -" అని పెద్ద బావ ఆశ్చర్యపోయాడు.

అడక్కుండానే, చినబావగా రు తేట తెలుగులో తేల్చివేశాడు. "అబ్బాయి, కర్మకాండ చేయవలసింది నువ్వు. ఏర్పాట్లు చేసుకోవల సింది నువ్వు- సమయానికి వచ్చింది నువ్వు. వాళ్ళమీదా వీళ్ళమీదా ఆధారపడితే పుణ్యకాలం గతిస్తుంది''.

రామునిమీద నాకు చికాకు వేసింది. వాడు బయట బొంగులు చీల్పించి దొడ్డమ్మ ఆఖరు ప్రయాణానికి పాడెకట్టిస్తున్నాడు. రైతు లెవరో తులసిమొక్కలు పెద్దమోపు కట్టి తెచ్చి పడేస్తున్నారు. ఎవరూ పురమాయించకుండానే అనేక చిన్న చిన్న కార్యాలు నెరవేరి

పోతున్నాయి. నావంక క్రీగంటితో చూస్తూ రాముడు వచ్చి ఎదట నిల బడి, అంతదుఃఖంలోనూ చిరునవ్వు పెదిమలతో నాకోపం పోగొడు తున్నాడు. ''కోపం తెచ్చుకోకు. నీ అనుభవానికి- ఆ ఆషాఢ భూతుల్ని అడగమన్నాను. నీ కోసం చెట్టుకింద ఎవరు నిలిచి వున్నారో చూడు''

అప్పుడు చూశాను భారతిని. కళ్ళుపొంగి, ముఖం ఎర్రబడి దైన్యమూర్తిగా నిలిచి వుంది.

''దొడ్డమ్మ నా వద్ద కొంత డబ్బు వుంచి పోయింది''

''ఎందుకిచ్చిందో...నీవే వుంచుకో'' అన్నాను యింకేమీ తోచక.

''కాదు...నీకివ్వమనే...యిటువంటి సమయం రావచ్చని... అంటే...తన ఖర్చులకే''- భారతి రుద్ధ కంఠం నుండి యిక మాటలు రాలేదు. నోట్లు చుట్టివున్న కాగితం పొట్లాం అందుకుంటూంటే, దొడ్డమ్మ మాటలే ప్రతిధ్వనించినట్లయినాయ్. ''ఎందుకు దైన్యం పడటం? రాముణ్ణి నమ్మినవాళ్ళకు ఋణం చేయనవసరం లేదురా'' దొడ్డమ్మ చేయి ఎప్పుడూ పైనే. డబ్బందుకొని రాముడు వెళ్ళిపోయాడు- సామాన్లు పురమాయించటానికి.

శవానికి శుచి స్నానం చేయిస్తున్నపుడు, శాస్త్రిగారే మొదట గమనించారు. దొడ్డమ్మ రెండు బొటనవేళ్ళకూ సిరామరకలు. నిశానీ దార్ల గుర్తులు. రాముడికి నిర్దేశించి చూపుతున్నారు. వాళ్ళిద్దరూ ముఖా ముఖంగా నిశ్శబ్ద సంకేతాలిచ్చుకోవటం నాకు పూర్తిగా అర్థం కాలేదు.

దొడ్డమ్మను చితాభస్మం చేసి గృహోన్ముఖమైనప్పుడు గూడా వాళ్ళు నాకేమీ వివరించి చెప్పలేదు. వరండాలో దీపారాధన ప్రమిదె ముందు, భారతి ఏకాకిగా అవనత ముఖిగా కూర్చొనివున్నది. లోపల అక్కల వాగ్యుద్ధం బయటకు వినబడుతూనే వున్నది.

రాముడు స్కూలు మానేసింతర్వాత కొన్నాళ్ళు శాస్త్రిగారి వద్ద సంస్కృత భాషాభ్యాసం చేశాడు. ఛందస్సుతో పెద్దప్రమేయం

లేకుండా, ఆశుకవిత్వంగూడా చెప్పగలడు. దుష్ట సమాసాలు వేయటంలో దిట్ట. కాని నాకుగూడా అర్థమవుతూంటాయ్.

ఇంట్లోకలహాన్నుద్దేశించి శాస్త్రిలవారు ప్రశ్నిస్తున్నట్లుంది. రాముడు సమాధానం చెబుతున్నాడు.

"కిమ్ విశేషః?" "విష కన్యాత్ కాలనాగః పరస్పర కలహః" అంటూనే, నేను కాళ్ళు కడుక్కొంటుంటే సమీపానికి వచ్చి- "మీ పెద్దమ్మవి రెండు వెండికంచాలు, బంగారం ఆభరణాలవద్ద పెద్దతగాదా వచ్చిందోయ్" అని చెప్పవచ్చాడు. భారతిగూడా విన్నది.

"దొడ్డమ్మ ఫోటో అటకమీద పెట్టెలో వుండాలి. అటక ఎక్కగలవా?" అని అడిగాను.

"అక్కర్లేదు భాయి. అటకమీది సామాన్లు నిన్ననే బళ్ళల్లో వెళ్ళిపోయాయి. నీకు మిగిలేది తలుపులూ, ద్వారబంధాలు. అవిగూడా నమ్మకం లేదు. మీ దొడ్డమ్మ శవం వేలు ముద్దర్లువేసి ఆస్తివాళ్ళకప్పగించింది గదా" అన్నాడు రాముడు.

అస్థినిమజ్జనానికి పెదబావ, చినబావ నాతో విజయవాడ దుర్గాఘాటుకు వచ్చారు. దొడ్డమ్మ క్రిష్ణవేణమ్మలోనే కలిసిపోవాలని ముచ్చటించిందిగదా.

"ఎందుకయ్యా - యీ కాల నాగులు మనతో? ఆమె ఆత్మకు శాంతి వుండక్కర్లేదా?" అని శాస్త్రిగారు నన్ను రహస్యంగా పృచ్ఛిస్తున్నారు.

"రానీండి. వాళ్ళేగదా రక్త బంధువులు"

"కాదు నాయనా, అవి మాయజలగలు. ఆ విషకన్యలు నీమీదకు తోలారు"

శాస్త్రిగారు అంతహీనంగా మాట్లాడటం నాకు నచ్చలేదు. గట్టుమీద తడిగుడ్డలు పిండుకొంటూంటే పెద్దబావ నా వెనకనే వచ్చాడు. "నీతో తర్వాత మాట్లాడాలి" అని చినబావ బస్సు దగ్గిరికి కామోసు

వెళ్ళిపోయాడు. అతను వెళ్ళాక పెద్దబావగారు అడిగారు.

"కర్మ అయిపోగానే వెళ్ళిపోతావా?"

"అవును, సెలవులేదు"

"చూడు....దొడ్డమ్మ రేపు ప్రాణం విడుస్తుందనగా వీలునామా రాసింది మీ పెద్దక్క పేర. ఈకాగితాలు చదువు"

నేను చదవలేదుగాని, 'ఆమె' వేలిముద్రలు మాత్రం స్పష్టంగా వున్నాయి. దొడ్డమ్మ చిన్న ముత్యాల దస్తూరితో రామకోటి వ్రాసేది. దేవనాగరలిపిలో భగవద్గీత చదివేది. నాకు వ్రాసే ఉత్తరాలకు ఇంగ్లీషు లోనే చిరునామాలు వ్రాసేది.

"మంచిది - నేను చదివేదేమున్నది? దొడ్డమ్మ యిష్టం కదా" అన్నాను నేను. నన్నొదిలిపెట్టి యిక ఆయన వెంటనే వెళ్ళిపోయాడు.

నిత్యకర్మ ప్రారంభించిన సాయంత్రం చిన్నక్కా బావా నన్ను వుయ్యాలబల్లమీద నిద్రలేపారు. రాముడు గాదెల్లో ధాన్యాన్ని మిల్లు కెత్తిస్తున్నాడు. నిత్యాన్నదానం చేయాలని వాడు పట్టుదలగా ఉన్నాడు.

"సెలవెప్పటిదాకా?" అని బావగారి ప్రశ్న.

సెలవులసంగతి చెప్పాను.

"తమ్ముడు యీ మిలిటరీలో ఎందుకు చేరాడో బ్రహ్మప్రళయం గదా సెలవంటే" అని అక్క సానుభూతి.

నేను హైస్కూలు పరీక్షలు పాసయినాక, దొడ్డమ్మ కాలేజీలో చేర్పించినపుడు - యీ చిన్నక్క పోరు, విసురుడు మాటలూ వినలేకే గదా, నేను మిలిటరీలో చేరింది. దొడ్డమ్మ వారించినా నేను వినలేదు.

"విను తమ్ముడూ, దొడ్డమ్మ ఇల్లూ, పొలాలూ మా పిల్లలపేర వీలునామా వ్రాసిపోయింది. నీకు ఉద్యోగంవుంది. బావగారి వైద్యం సంపాదన అంతంత మాత్రమేగదా"

"పొలమంతా వ్రాసేసిందా!" అని అడిగాను నేను.

"ఏం, అనుమానం వచ్చిందా?"

"కాదులే. ఒక ఎకరంపొలం పెదనాన్నగారు పోయాక శాస్త్రి గారికి భూదానం క్రింద చదివించిందిగదా. అది రిజిస్టర్ చేయించాలని అంటుండేది"

బావగారు అన్నాడు - "తరవాత అభిప్రాయం మార్చుకొన్నదోయ్. ఆయనకు యితరత్రా భూరిదానాలు ముట్టిపోయాయ్‌గదా"

"ఏమో, నాకంతగా తెలీదు. అయినా నాకెందుకు చెబుతున్నారిదంతా?"

"వీలునామాను ప్రొబేటుచేయించాలి గదా. రిజిష్ట్రారు ఆఫీసుకు నువ్వూ రావాలి"

"వీలునామా మీద వేలుముద్రవేసిందా?"

"అదేమిట్రా తమ్ముడూ, దొడ్డమ్మకు చదువులేదా? శుభ్రంగా సంతకం చేసింది"

ఈ వీలునామా మీద దొడ్డమ్మ సంతకం పెద్దబాలశిక్షలో గుణింతం అక్షరాల కన్నా పెద్దవిగా వున్నాయి.

"మరి పెద్దక్కకు గూడా విల్లురాసిందిగదా. వేలుముద్ర వేసిందెందుకో"

"అబద్ధం. ప్రాణిపోయిందాకా మేమేవున్నాం"

"పెద్దక్క చివరిదాకా సేవచేశానన్నదే"

"సేవా? నా బొందా?" అని చిన్నక్క అన్నది.

"మంచిది. కర్మకాండ ముగిసిందాకా నేనెక్కడికీ కదలగూడదంటున్నారు గదా శాస్త్రులవారు" అని ముగించాను నేను.

* * *

మధ్యాహ్నం వైకుంఠ సమారాధన జరిగిపోయింది. ఆ సాయింత్రం ఆశీర్వచనాల కాండ జరుగుతున్నది. చాలామంది వచ్చారు- జ్ఞాతులూ, పెదనాన్నగారి బంధుమిత్రులూ, అశేషంగా గ్రామస్థులూ వచ్చి కూచొన్నారు. శాస్త్రులవారు - దొడ్డమ్మగారనే చల్లని ఫలవృక్షపు

నీడలో సేదదీర్చుకొన్న వారందరూ ధన్యులేనని ఆమె గుణగణాల్ని వివరించి చెబుతున్నారు. చిన్నక్క నాకో జనతా ధోవతీ, పెద్దక్క పండాల ఎఱ్ఱగీతల అంగ వస్త్రం - చదివించారు.

భారతమ్మ రాలేదా?" - అని శాస్త్రిగారు నలుదిక్కులా కలియ జూశారు. రాముడు భారతి కోసం మనిషినిపంపి, నా వెనకనే వచ్చి కూచున్నాడు.

"మరి ఆస్తిపాస్తుల్ని గురించి ఏమైనా ఆ పుణ్యాత్మురాలు చెప్పి పోయిందా?" అని మణియదారుగారు ప్రశ్నించారు.

"అదిగో, అక్కడికే వస్తున్నానాయనా" అంటూ బ్రహ్మయ్యగారు పంచాంగం కట్ట విప్పి, స్టాంపుల దస్తావేజు పైకితీశారు. గొంతు సవరించు కొన్నారు.

"నాయనా విను. సభాసదులు, బంధుమిత్రులు అందరూ విన వలసిందే. గంగాభాగీరథీసమానురాలైన స్వర్గవాసిని సుభద్రమ్మగారు - అంటే మీ దొడ్డమ్మగారు. అయిదు నెలల క్రితం తన వీలునామా స్వహస్తాలతో వ్రాసుకొని సబ్ రిజిష్ట్రార్ వారి సముఖంలో రిజిష్టరీ చేయించింది. సర్కారువారి ఫీజులు, పన్నులూ సక్రమంగా చెల్లించి వేసింది. చిన్నకరణం దేశరాజుగారు, ఆమె భూమి కౌలుదారుడు లక్ష్మయ్య, ఇంటిపురోహితుణ్ణి నేను ఇందుకు సాక్షులం, సంతకాలు చేసినవాళ్ళం. ఇక వివరాలు గూడా మనవి చేస్తాను. ఆలకించండి.

ఈ డాబా యిల్లూ, ముందూ, వెనకా వున్న ఖాళీస్థలమూ, పశువుల శాలతోసహా నీ పేర వ్రాసింది. నీ మిలిటరీ సర్వీసు ముగించుకొన్నాక నీవిక్కడేస్థిరపడాలని ఆమె అభిమతం. పోతే 297 సర్వే నంబర్లోవున్న వారిపాత ఇల్లూ, ఖాళీస్థలమూ, పాంధులకు, సాధుసన్యాసులకు, నిరాధారులకు సర్వులకు వుపయోగపడేటట్లుగా ధర్మసత్రం కిందదానంచేస్తూ వ్రాసింది. దీనికి జీవితట్రస్టీలు ధర్మకర్తలుగా ఘంటసాల రంగయ్య శ్రేష్టి, బొందిలీ రామసింగూ, రాయుడుగార్లుగా - ఆతల్లి పేర్కొన్నది.

వారికి అంగీకారమేనని నాభావన. ఇకపోతే - మీ పెదనాన్నగారు - పెద సింగుకు ఏర్పాటు చేసిన కైవల్యకుటీరమూ, దానికానుకొని వున్న అరెకరం తోటభూమి రామసింగు వివాహంచేసుకొన్న తర్వాత వానికి దాఖలు అయేటట్లుగా వున్నది.

ఇక భూవసతి. నీవు సైనిక ధర్మం నిర్వహిస్తూ దేశాటనంలో వుంటావుగనక - తనకు స్త్రీ ధనంగా సంక్రమించిన అయిదెకరాల మెట్ట భూమి, పెదనాన్నగారి తర్వాత సంక్రమించిన నాలుగెకరాల మాగాణి పొలమూ - నీ కాబోయే అర్ధాంగి, గృహిణి భారతిపేరా, ఆమెకు భవిష్యత్తులో జన్మించపోయే సంతానానికి చెందుతుంది"

చిన్నక్కా పెద్దక్కా ఏడుపు లంకించుకొన్నారు.

"ముదనష్టపు ముండ. దరిద్రపుమందికి పెట్టి పోతుందా. వీళ్ళ వంశాలు నాశనంగాను"

"ష్....దివంగతురాలిని, అందునా అకలంక పుణ్యాత్మురాలిని, దాతను - నిందించిన వారికి పుట్టగతులుండవు తల్లులారా! మీ మాట గూడావుంది. వినదలచుకొన్నారా లేదా?" - శాస్త్రిగారు గట్టిగా మందలించారు.

వాళ్ళు వినదలుచుకోలేదు. మొత్తుకోళ్ళతోనే లేచిపోయారు.

"సభాసదులు - పెద్దలు, చిన్నలు - వింటే చాలు. ఇక ఆమె జవ్హారి. పాతికవేలు చేసే ఆమె బంగారు నగలు విక్రయించగా సమకూడిన మొత్తం ప్రస్తుతం బ్యాంకిలో వున్నది. అది మీ పెదనాన్నగారి పూర్వీకులు నిర్మించిన శివాలయం మరామత్తులకోసం కేటాయించబడ్డది. పింఛను పుచ్చుకొని మన గ్రామంలోనే వుంటున్న ప్రముఖ ఇంజనీరు మూర్తిగారు - యీపనులు సక్రమంగా చేయించే ఒప్పందం యిదివరకే వుంది.

చివరి ఐటమ్ యింట్లో రెండు భారీ వివాహకార్యాలకు సరిపోగల పాత్ర సామగ్రి, బంగారం పువ్వు పొదగబడ్డ పెదనాన్నగారి వెండి

కంచం - మీ పెద్దక్కగారి సంతానమైన రుక్మిణమ్మకు చెందుతుంది. తన వెండికంచం, ఆమె సోదరీమణి సత్యభామకు అప్పగించాలి. పాత్ర సామాను, గంగాళాలు యిత్యాది గ్రామంలో ఎవరింట శుభా శుభకార్యాలు జరిగినా వుచితంగా వాడుకకు యిస్తుండాలి. జమేదారీ భారతమ్మది."

బ్రహ్మయ్యగారు ముగించివేస్తూ - "నేను ఉదాహరించనిది - నా భూదానపత్రం గురించి. అదీ రిజిష్టరీ అయింది. నాపరం అయింది" అని నామీద అక్షతలు చల్లి సభకు నమస్కరించారు.

* * *

నేను సెలవుకోసం - ఏ ప్రయత్నమూ చేయదలచుకోలేదు. బ్రహ్మకుండం, మాతృగయ, హరిద్వారం, రిషీకేశం, వారణాశి యిత్యాది క్షేత్రాలన్నీ దొడ్డమ్మ చూడకుండానే పోయింది. మిగిలివున్న అస్థిక నిక్షేపాలను యీ క్షేత్రాల్లో నిమజ్జనం చేయాలని నాకెంతో ఆత్రుతగా వున్నది. దొంగ వీలునామాలను గురించి, పాత్రసామాను తరలింపుగురించీ పోలీసు రిపోర్టివ్వండి, పంచాయితీలు పెట్టించండని, నిన్న మొన్నటిదాకా - నన్ను మనిషిగా లెక్కజెయ్యనివాళ్ళు గూడా ప్రోద్బలం చేశారు. రాముడు నిత్యమూ వుపన్యాసాల్లో దంచే "ప్రైవేటు ప్రాపర్టీ" లోక సత్యాలను ఎట్లా తలకిందులు చేయగలదో ప్రత్యక్షంగా చూశాను. దేవ దానవ యుద్ధాలనుండి నేటిదాకా నడుస్తున్న రక్తపాతాలకు మూలకారణమైన "ఆస్థిహక్కు" నిజస్వరూపం యిన్నాళ్ళకు వీక్షించ గలిగాను. ఏ గ్రంథమూ, ఏ వుపన్యాసమూ యివ్వజాలని నీతిచంద్రిక పాఠాన్ని, దొడ్డమ్మ నాకు బోధించి పోయింది.

అందువల్ల, నాకొత్త హోదా (ల్యాండ్‌లార్డ్)లో గూడా నేనెవ్వరి మీదా రిపోర్టులు చేయదలుచుకోలేదు.

పెద్దక్క నామీద - అమర్యాద, గౌరవం వుంచదలచుకోలేదు. నా కిట్‌బాక్సును, సామాన్లను - భారతి సర్ది పెడ్తూన్న సమయంలో, ఆమె ప్రభంజనం వలె వచ్చింది.

"పాపిష్టి పీనిగ. గిల్టు నగలు ఇంట్లోదాచి, అసలు సొమ్ము దాచేసింది" అని పాత పెద్దాపురం పట్టుటీరె ముక్కకు కట్టివున్న బందరు చిలకలపూడి నగల్ని నా ముఖాన బలంగా కొట్టిపోయింది.

నాకు తీవ్రంగా కోపం వచ్చింది.

ఇన్నాళ్ళూ - ఆస్థీ, బలగంలేని అనాధగా నాకు అందరితో సమానావకాశాలు పంచుకొని బదికే హక్కు లేదనుకొని శాంతం వహించే వాడిని.

ఇప్పుడా - ఆస్తీ, పలుకుబడిగల ఆసామిని. నన్నవమానపరుస్తుందా - చిల్లిగవ్వ చేయని యీమె? అని చివ్వున కోపం లేచింది.

తమాయించుకొన్నాను.

"దొడ్డమ్మా - నీ ఆధ్యాత్మిక - ఐశ్వర్యానికి నన్ను వారసుణ్ణి చేసి, యీ ఐహికమంతా వాళ్ళకే రాసిపెట్టి పోలేకపోయావా?" - అని ప్రార్థిస్తున్నాను.

నా బండి కూత కూస్తూ వచ్చేసింది.

రాముడూ, భారతీ, యింకా యితర్లు చెయ్యూపుతున్నారు - యీ కొత్త మనిషికి. కాని నేనెక్కాల్సిన రైలు యిదేనా?? ○

స్వాతి, ఏప్రిల్ 1988